

తేమతో సంబంధం లేకుండా ధాన్యం కొనాలి

భీమవరం : రంగుమారిన ధాన్యాన్ని, తేమశాతంతో సంబంధం లేకుండా ప్రభుత్వమే కొనాలని కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి ఎం.రామాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో నూతన విధానాన్ని తీసుకొచ్చి రైతుభరోసా కేంద్రాల ద్వారా కొంటామని హడావుడి హంగామా చేసిందని, ధాన్యం కొనుగోలుపై ఇటివల పౌరసరఫరాల సంస్థ ఎమ్‌డి వీరపాండ్యన్ రైతులు ధాన్యాన్ని ప్రయివేటు వ్యక్తులకైనా అమ్ముకోవచ్చని, ఆర్‌బికెల్లో సమాచారం ఇస్తే సరిపోతుందని చెప్పడం దారుణమన్నారు. ధాన్యం కొనుగోలులో కౌలురైతులను, పేదరైతులను దళారులు ప్రతీ బస్తాకు రూ.వంద నుండి రూ.200 వరకూ దోచేస్తున్నారని విమర్శించారు. అకాల వర్షాలు, వాతావరణం బాగోలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం తక్షణం స్పందించి ధాన్యం కొనుగోలు చేయకుండా రైతులు అయినకాడికి అమ్ముకోవచ్చని చెప్పటం రైతుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు.

నారుమడులకు వర్షం అడ్డంకి..!

పశ్చిమలో 33.16, ఏలూరు జిల్లాలో 13.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

నారుమడి వేసేందుకు రైతులు వెనుకంజ

రెండు జిల్లాల్లోనూ 3.20 లక్షల ఎకరాల్లో రబీసాగు

ఇప్పటికీ కల్లాల్లోనే ఖరీఫ్ ధాన్యం

రబీలో ధాన్యం కొనుగోలుపై ఇప్పటి నుంచే రైతుల్లో బెంగ



నారుమడిలో చేరిన వర్షపు నీరు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మాండూస్ తుపాను ప్రభావం రబీ నారుమడులపై పెనుప్రభావం పడింది. ముమ్మరంగా నారుమడులు వేస్తున్న తరుణంలో మాండూస్ తుపాను వల్ల కురుస్తున్న వర్షాలకు రైతులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు జిల్లాల్లోనూ ఇప్పటి వరకూ 20శాతం వరకూ రబీ నారుమడులు వేసినట్లు లెక్కలు చెబుతున్నాయి. ప్రతి మండలంలోనూ ముమ్మరంగా నారుమడుల ప్రక్రియ సాగుతోంది. తుపాను ప్రభావంతో రెండు జిల్లాల్లోనూ వర్షాలు పడుతున్నాయి. ఆదివారం పశ్చిమగోదావరి జిల్లాలో సరాసరి వర్షపాతం 33.16 మిల్లీమీటర్లు నమోదుకాగా, ఏలూరు జిల్లాలో 13.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. గణపవరం మండలంలో 44.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. భీమడోలులో 36.4 మిల్లీమీటర్లు, నిడమర్రులో 31.6 మిల్లీమీటర్ల చొప్పున అత్యధిక వర్షపాతం నమోదైంది. పశ్చిమగోదావరి జిల్లా పెనుమంత్ర మండలంలో 78.4 మిల్లీమీటర్లు, అత్తిలిలో 67.4, పోడూరు మండలంలో 70.2 మిల్లీమీటర్ల అత్యధిక వర్షం కురిసింది. వర్షాలకు ఇప్పటికే వేసిన నారుమడులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడటంతో మిగిలిన చోట్ల నారుమడులు వేసేందుకు రైతులు ఆలోచిస్తున్నారు. తుపాను ప్రభావంతో రెండు జిల్లాల్లోనూ వర్షం, చలిగాలులతో వాతావరణం అనుకూలంగా లేదు. దీంతో రైతులు నారుడులు వేసేందుకు భయపడుతున్నారు. నారుమడివేస్తే వర్షాలకు దెబ్బతినే అవకాశం ఉందని, అదే జరిగితే మరోసారి విత్తనాలు కొనుగోలు చేయాలంటే పెట్టుబడి భారమవుతుందని రైతులు ఆలోచిస్తున్నారు. రబీలో పశ్చిమగోదావరి జిల్లాలో 2.50 లక్షల ఎకరాలు, ఏలూరు జిల్లాలో 70 వేల ఎకరాల్లో రైతులు వరిసాగు చేస్తున్నారు. నారుమడులు త్వరితగతిన పూర్తయితే సంక్రాంతి పండుగకు ముందే నాట్లు పూర్తయ్యే అవకాశం ఉంటుంది. ఈ ఏడాది రైతులు నారుమడులు ముందుగానే ప్రారంభించినప్పటికీ వర్షం ప్రభావంతో ఆలస్యమైంది. తుపాను ప్రభావం పూర్తిగా తగ్గిన తర్వాతనే నారుడులు వేయాలని రైతులు భావిస్తున్నారు. దీంతో రబీ నారుమడులు ఆలస్యమయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

ఇప్పటికీ కల్లాల్లోనే ఖరీఫ్ ధాన్యం

ప్రభుత్వం తెచ్చిన నూతన ధాన్యం కొనుగోలు విధానం ఖరీఫ్ రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. దాదాపుగా ఖరీఫ్ మాసూలు పూర్తయినప్పటికీ ఇప్పటికీ ధాన్యం కొనుగోలు మాత్రం పూర్తికాలేదు. కొన్ని మండలాల్లో 50శాతం, మరికొన్ని మండలాల్లో 20 శాతంపైగా ధాన్యం కల్లాల్లోనే ఉండిపోయింది. తేమశాతం పేరుతో మిల్లర్లు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఆర్‌బికెల్లో తేమశాతం సరిపోయిందని ధాన్యం కొనుగోలు చేసిప్పటికీ మిల్లరు మాత్రం తేమశాతం అధికంగా ఉందంటూ ధాన్యం వెనక్కి పంపిస్తూ రైతులను తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారు. తూకంలో తేడా వచ్చిదంటూ రైతుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. తొలుత ఇ-క్రాప్ పూర్తయిన ప్రతి ఎకరా పంటను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని చెప్పి.. ఇప్పుడు టార్గెట్‌లు పూర్తయ్యాయని, వ్యాపారులకు, మిల్లర్లకు అమ్ముకోవాలని చెబుతున్న ప్రభుత్వ తీరుపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై రైతులు మండిపడుతున్నారు. కల్లాల్లోనే ధాన్యం ఉండిపోవడంతో వర్షాలకు రైతులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. రబీలో ధాన్యం కొనుగోలు ఇదేవిధంగా ఉంటే తమ పరిస్థితి ఏమిటంటూ రైతులు ఇప్పటి నుంచే తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రబీ ధాన్యం కొనుగోలులోనూ ఇదే పరిస్థితి కొనసాగితే ఇక వ్యవసాయం చేయడం కష్టసాధ్యమన్న భావనకు రైతులు చేరుకున్నారు. రబీ ధాన్యం కొనుగోలుపై ప్రభుత్వం ఇప్పటినుంచే ప్రణాళికలు రూపొందించకపోతే రైతులకు కష్టాలు తప్పవని చెప్పొచ్చు.



మాట్లాడుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

వైసిపి హయాంలో విద్యావ్యవస్థ బలోపేతం

మంత్రి కారుమూరి

ప్రజాశక్తి - పాలకోడేరు


దేశంలో విద్యా రంగంలో మొదటి స్థానంలో ఉన్న కేరళ రాష్ట్రం తర్వాత ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఆదర్శవంతంగా నిలిచిందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. టిడిపి హయాంలో రాష్ట్రం విద్యలో 18వ స్థానంలో ఉండేదని వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టాక మూడేళ్లలో రెండో స్థానానికి చేరామన్నారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని ముఖ్యంగా నాడు-నేడు పథకం, అమ్మఒడి, విద్యాదీవెన వంటి పథకాలతో విద్య మరింత బలోపేతమైందన్నారు. వచ్చే ఏడాది దేశంలోనే మొదటి స్థానానికి వచ్చే విధంగా ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. పెన్నాడ అగ్రహారంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ మేనిఫెస్టో ప్రకారం ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని, రాష్ట్రంలో ఇంకా రోడ్లు నిర్మించాల్సి ఉందని, మరో రెండు నెలల్లో రోడ్లన్నీ పూర్తిచేస్తామని చెప్పారు. రాష్ట్రం అప్పుల్లో కూరుకు పోయిందని చంద్రబాబు అసత్య ప్రచారం చేస్తున్నారని, ఇప్పటివరకూ ప్రభుత్వం రూ.లక్షా 20 వేల కోట్లు అప్పు చేశారని చెప్పారు. టిడిపి హయాంలో సుమారు రూ.2.71 లక్షల కోట్లు అప్పు చేశారని తెలిపారు. చంద్రబాబు మతిభ్రమించి మాట్లాడుతున్నారని విమర్శించారు. అన్ని తానే చేశానని గొప్పలు చెప్పడం తప్ప రాష్ట్రానికి చేసిందేమీ లేదన్నారు. అనంతరం పాలకోడేరులో నిర్మించిన మహిళా మండల సమైక్య భవనం, రైతు భరోసా కేంద్రాలను ప్రభుత్వ చీఫ్‌విప్ ప్రసాద్‌రాజు, జెడ్‌పి ఛైర్మన్ కౌరుశ్రీనివాస్, డిసిసిబి ఛైర్మన్ నరసింహరాజు, ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణరాజు(చంటి రాజు)తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు చిల్లా అనూష సత్యనారాయణ, ఇంజేటి మరియమ్మ, లక్ష్మీపతి, వైసిపి నాయకులు గోపాలకృష్ణంరాజు, కొత్తపల్లి కాశీ విశ్వనాథరాజు, వర్ణలత లక్ష్మీతులసి, నరేష్ అశోక్‌బాబు, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

ఆదర్శవంతంగా వైసిపి సంక్షేమ పథకాలు

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ


ప్రజాశక్తి - పాలకోడేరు

ఎన్నికలు దగ్గరపడుతున్న క్రమంలో రాష్ట్రంలో దొంగల దండు బయలుదేరిందని, వీరి పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రమైన పాలకోడేరులో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆదివాంం రాత్రి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ టిడిపి హయాంలో వెలగపూడిలో అడుగు రు.12 వేలు వెచ్చించి నిర్మించారని, అయితే వర్షం వస్తే అంత లీకేజీ అని అన్నారు. వైసిపి ప్రభుత్వం అడుగు రూ.1500 చొప్పున ఎన్నో హంగులతో, సుందరంగా నిర్మించామని తెలిపారు. చంద్రబాబు అధికారంలో ఉండగా దాచుకో దోచుకో అన్నట్టు అవినీతి చేశారన్నారు. చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో ఒక్కటి కూడా సరైన పథకాన్ని ప్రవేశ పెట్టారా అని ప్రశ్నించారు. దొంగల ముఠాగా మారి రాష్ట్రాన్ని చంద్రబాబు అండ్ బ్యాచ్ దోచేశారన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాజకీయాలతో సంబంధం లేకుండా వినూత్న పథకాలు వాలంటీర్, సచివాలయ వ్యవస్థలతో మెరుగైన పాలన అందిస్తున్నారన్నారు. పార్టీలకు, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సిఎం జగన్‌కు దక్కుతుందన్నారు. దళారీ వ్యవస్థ లేకుండా ప్రభుత్వ పథకాలను నేరుగా లబ్ధిదారులకు వైసిపి ప్రభుత్వం అందిస్తుందన్నారు. దేశంలోని రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్‌లోని అభివృద్ధి కార్యక్రమాలు వైపు చూస్తున్నాయన్నారు. జగన్ ప్రవేశపెట్టిన ఆర్‌బికె వ్యవస్థను దేశమంతటా ప్రవేశపెట్టాల్సి ఉందని సూచించారు. రాష్ట్రంలో ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను తమిళనాడు, కేరళ, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్ వంటి రాష్ట్రాల బృందాలను పరిశీలించి వెళ్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ రాజు, ఎంపిపి భూపతి రాజు సత్యనారాయణ రాజు (చంటి రాజు), సర్పంచులు ఇంజేటి మరియమ్మ, లక్ష్మీపతి, ఎంపిటిసిలు నాగలక్ష్మి, స్వాతి, నాయకులు చేకూరి రాజా నరేంద్ర వర్మ, ఉప సర్పంచి దెందుకూరి వెంకటరాజు, భూపతి రాజు వంశీకృష్ణంరాజు, కొత్తపల్లి కాశీ విశ్వనాథరాజు, గోపాలకృష్ణంరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొట్టు సత్యనారాయణ

ఆర్‌టిసిని కాపాడుకోవాలి : ఎస్‌డబ్ల్యుఎఫ్



మాట్లాడుతున్న టివిఎస్.మూర్తి

ప్రజాశక్తి - తణుకురూరల్

ఆర్‌టిసి ప్రయివేటుపరం కాకుండా పరిరక్షించుకోవాలని ఎస్‌డబ్ల్యుఎఫ్ జిల్లా అధ్యక్షులు టివిఎస్.మూర్తి పిలుపునిచ్చారు. తణుకు డిపో ఎస్‌డబ్ల్యుఎఫ్ ఐదో మహాసభ ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో వి.రాణి అధ్యక్షతన జరిగింది. సందర్భంగా మూర్తి మాట్లాడుతూ ఆర్‌టిసి ప్రభుత్వరంగంలో కలిసినా, ప్రయివేటీకరణ విధానం మారలేదన్నారు. ప్రభుత్వంరంగంలోకి మారిన నాటినుండి ఇప్పటి వరకూ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించలేదన్నారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిల గురించి అడిగినా, ఉద్యమాలు చేసిన ఉద్యోగస్తులపై అధికారుల నిర్బంధాలు, వేధింపులకు గురిచేస్తూ వారికి మెమోలు, ఛార్జీషీట్లు ఇచ్చి మానసికంగా వేధిస్తున్నారన్నారు. నేడు ప్రభుత్వం బస్సులను కొనుగోలు చేయకుండా ప్రతిడిపోలో ప్రభుత్వ బస్సుల కన్నా అద్దె బస్సుల శాతాన్ని పెంచారని తెలిపారు. దీనివల్ల డ్రైవర్లు గ్యారేజీలో పనిచేసే మెకానిక్‌లకు ఉద్యోగాలు లేకుండా పోతున్నాయన్నారు. రవాణారంగంలో ఆర్‌టిసి ప్రథమ స్థానంలో ఉందని, దాన్ని పూర్తిస్థాయిలో ప్రయివేటీకరణ చేయాలని ప్రభుత్వం ఆలోచించడం విచారకరమన్నారు. ఆర్‌టిసిలో ప్రజలకు ప్రయాణ సౌకర్యాల్లో అనేక రాయితీలిస్తూ ఆర్‌టిసిని లాభాల్లో నడిపిస్తున్న ప్రభుత్వం మాత్రం ఆర్‌టిసికి నష్టాలొస్తున్నాయని, ప్రభుత్వం నడపడం అసాధ్యమని తప్పుడు లెక్కలు చూపుతున్నారని విమర్శించారు. నేడు ఆర్‌టిసిలో ప్రయాణం చేస్తే గమ్యానికి క్షేమంగా చేరుస్తారనే నమ్మకం ఉందని, ప్రయివేటు వాహనాల్లో ప్రయాణం ప్రమాదకరమనే భయంలో ప్రజలున్నారని తెలిపారు. ప్రజలు ఆర్‌టిసిపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలుపుకోవాలన్నారు. ఉద్యోగులంతా ఐక్యంగా ఆర్‌టిసిని కాపాడుకోవాలన్నారు. ఈ నెల 15, 16 తేదీలో ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర మహాసభ నెల్లూరు పట్టణంలో జరుగుతుందని, ఆ సభలో భవిష్యత్ ఉద్యమాలు, పోరాటాలపై నిర్ణయాలు తీసుకుంటారని, ఉద్యోగులంతా వాటిని అమలు చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా కామన మునిస్వామి, అధ్యక్షులుగా ఎ.ప్రసాద్, ఉపాధ్యక్షులుగా సిహెచ్.రామకృష్ణ, కార్యదర్శిగా ఎన్.శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శిగా వి.రాణి, ప్రచార కార్యదర్శిగా దుర్గారావు, ట్రెజరర్‌గా కెజికెఎన్‌విఎస్.కుమార్ ఎన్నికయ్యారు.

ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - పోడూరు

తేమ శాతంతో ప్రమేయం లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి పిల్లి.ప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం పోడూరులో సిపిఎం బృందం పర్యటించి రైతులను కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా రైతు బూరాబత్తుల నాగేశ్వరరావు మాట్లాడుతూ కొత్తపాలసీ విధానం వల్ల రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అనంతరం సిపిఎం మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్ మాట్లాడుతూ మూడు రోజుల నుంచి కురుస్తున్న అకాల వర్షాల కారణంగా ధాన్యం తడిసిపోయిందని, తేమ శాతంతో సంబంధం లేకుండా ప్రభుత్వం నేరుగా ధాన్యం కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. మిల్లర్లను ఇంత ధాన్యం తీసుకోవాలని పరిమితి విధించడం సరికాదన్నారు. మొత్తం ధాన్యం ప్రభుత్వమే గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బొంతు శ్రీను, ఎం విష్ణుమూర్తి, కుసుమే గాంధీ, కాటికి పెద్దిరాజు, కందికట్ల వెంకటేష్ పాల్గొన్నారు.



ధాన్యాన్ని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

అన్నదాత ఆశలపై.. నీళ్లు

వర్షానికి తడిసిన వరి పనలు, ధాన్యం

రైతుల ఆవేదన

ప్రజాశక్తి - కాళ్ల

మాండూస్ తుపాను ఖరీఫ్ పంటపై ప్రభావం చూపింది. రైతుల రెక్కల కష్టం నీళ్ల పాలు చేసింది. శనివారం కురిసిన వర్షానికి వరి పనలు, ధాన్యం రాశులు తడిసిపోయాయి. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ధాన్యం రాశుల్లోకి నీరు చేరిపోయాయని రైతులు, కౌలు రైతులు ఆవేదన చేస్తున్నారు.

మాండూస్ తుపాను నేపథ్యంలో మండలంలో పలు ప్రాంతాల్లో శనివారం రాత్రి కురిసిన వర్షానికి చేల్లో వరి పనలు తడిసిపోయాయి. చాలా చోట్ల రైతులు ధాన్యం రాశులపై బరకాలు కప్పినా కొన్నిచోట్ల వర్షపు నీరు నిలిచి ధాన్యం తడిసిపోయాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. మండలంలో కాళ్ల, కాళ్లకూరు, సీసలి, దొడ్డనపూడి, కోపల్లె, వేంపాడు, బొండాడ, జక్కరం గ్రామాల్లో వర్షానికి తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే పంట చేతికి రావడంతో నూర్పులు చేసే పనిలో ఉన్నారు.

బరకాలకు గిరాకీ..

కోసిన ధాన్యాన్ని బ[illegible] అవసరమయ్యే బరకాలకు గిరాకీ ఏర్పడింది. వాటి కోసం రైతులు, కౌలు రైతులు పరుగులు తీస్తున్నారు. ఇదే అదునుగా కొందరు ఎక్కువ ధరకు బరకాలను అద్దెకు ఇస్తున్నారు. రోజుకు ఒక బరకానికి రూ.30 నుంచి రూ.50 వరకూ వసూలు చేస్తున్నారు. దీంతో రైతులకు అదనపు ఖర్చు అవుతోంది. ఒక్కో రైతు అవసరం మేరకు 10 బరకాల వరకూ అద్దెకు తీసుకుంటున్నారు. మరో రెండు రోజులపాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో బరకాలను అద్దెకు తీసుకుని ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకుంటున్నారు.



కాళ్లలో తడిసిన వరి పనలను ఆరబెడుతున్న రైతు మారేశ్వరరావు

పాలకొల్లు : నియోజకవర్గంలో మాండూస్ తుపాన్ ప్రభావం తగ్గింది. శనివారం రాత్రి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసినా తెల్లవారుజాము నుంచి వర్ష ప్రభావం తగ్గింది. అయితే వర్షం వల్ల అంతంతమాత్రంగానే ఉన్న రోడ్లు మరింత పాడయ్యాయి. కల్లాల్లో తడిచిన ధాన్యం ఆరబెట్టడానికి రైతులు ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలో సగంపైన ఖరీఫ్ పంట కోయడానికి సిద్ధంగా ఉంది.




పాలకొల్లులో ధాన్యం ఆరబెడుతున్న రైతులు

వరి పనలు తడిపోయాయి..

కేసిరెడ్డి వెంకట మారేశ్వరరావు, రైతు, కాళ్ల

రెండున్నర ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేశాను. పంట కోసి నాలుగు రోజులవుతోంది. శనివారం కురిసిన వర్షానికి చేల్లో వరి పనలు తడిసిపోయాయి. ఎకరానికి రూ.25 వేలు పెట్టుబడి పెట్టాను. తడిసిన వరి పనులను ట్రాక్టర్‌పై మెరక దిబ్బకు తరలించి ఆరబెడుతున్నాను. వరి పనలు ఆరిన తర్వాత నూర్పిడి పనులు చేస్తా.



పట్టణాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నాం

విస్సాకోడేరు, గునుపూడి లేఅవుట్లకు రూ.9 కోట్లతో రెండు సబ్ స్టేషన్లు



డిస్ట్రిబ్యూషన్ లైన్ల పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పట్టణాభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం 39, 36వ వార్డుల్లో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. ముందుగా 39వ వార్డులో రూ.43.82 లక్షలతో చేపడుతున్న రిజర్వాయర్ నుంచి డిస్ట్రిబ్యూషన్ లైన్ పనులకు, 36వ వార్డు ఆరేటినగర్‌లో రూ.33.86 లక్షలతో చేపట్టే వాటర్ డిస్ట్రిబ్యూషన్ లైన్ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి వార్డులో ప్రజల కోరిక మేరకు అభివృద్ధి పనులు పెద్ద ఎత్తున జరుగుతున్నాయని అన్నారు. అమృత పథకంలో దుర్గాపురంలో నిర్మించిన రిజర్వాయర్‌ను త్వరలో ప్రజా వినియోగంలోకి తీసుకొస్తామని అన్నారు. ఆరేటినగర్‌లో 30 సంవత్సరాలకుపైగా ఉన్న తాగునీటి సమస్యను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో పైపులైను ఉన్నప్పటికీ సరైన డిజైన్‌లో పైపులైను లేకపోవడంతో పూర్తిస్థాయిలో ఈ ప్రాంత వాసులకు తాగునీరు అందడం లేదన్నారు. పాత పైపులైను పూర్తిగా తీసివేసి కొత్త పైపులైన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. టిడ్కో గృహాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతంగా జరుగుతోందన్నారు. విస్సాకోడేరు, గునుపూడి లేఔట్లకు సంబంధించి లబ్ధిదారులకు విద్యుత్ సౌకర్యాన్ని కల్పించడానికి రెండు విద్యుత్ సబ్ స్టేషన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలలో మున్సిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ, ఎంఇ త్రినాథ్, డిఇ తోట నారాయణరావు, కొల్లి ప్రసాద్, కోయ శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

నేడు కొడమంచిలిలో గడపగడపకూ మన ప్రభుత్వం

ప్రజాశక్తి - ఆచంట

ఈ నెల 12వ తేదీ సోమవారం ఉదయం కొడమంచిలిలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రామ సర్పంచి సుంకర సీతారాం విలేకరులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగరాజు పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు. ఈ నేపథ్యంలో వివిధ శాఖల అధికారులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

వ్యకాస రాష్ట్ర కమిటీ సభ్యునిగా సోమరాజు



ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులుగా కండెల్లి సోమరాజు తిరిగి ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమరాజు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జంగారెడ్డిగూడెంలో జరిగిన 29వ రాష్ట్ర మహాసభలో పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించి నలుగురు తిరిగి రాష్ట్ర కమిటీకి ఎన్నికైనట్లు పేర్కొన్నారు. వారిలో తాడేపల్లిగూడెం ఏరియాకు సంబంధించి తాను ఎన్నికైనట్లు తెలిపారు. రానున్న రోజుల్లో పేదలు, వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై శక్తి వంచన లేకుండా పోరాడతానని తెలిపారు. తాడేపల్లిగూడెం ఏరియాలో అన్యాక్రాంతానికి గురైన అసైన్డ్ భూములను స్వాధీనం చేసుకునేలా పేదలను సమీకరించి భూ పోరాటాల నిర్వహిస్తామని తెలిపారు. భూమి, ఉపాధి కూలి సమస్యలపై నిరంతరం పోరాడతామని తెలిపారు. వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవడం కోసం సన్న, చిన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు దళితుల సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేస్తామని వారు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ప్రయివేటు ఉద్యోగి మృతి



మృతుడు నాగేశ్వరరావు

ప్రజాశక్తి - కాళ్ల

భీమవరం - ఉండి జాతీయ రహదారిలో పెదఅమిరం గ్రామం వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రయివేటు ఉద్యోగి మృతి చెందాడు. ఉండి గ్రామానికి చెందిన కుక్కల నాగేశ్వరరావు (52) భీమవరంలోని ఆనంద ఫిషరీస్ (చేపల ఎగుమతి) సంస్థలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి విధుల అనంతరం ద్విచక్ర వాహనంపై భీమవరం నుంచి ఇంటికి వస్తుండగా పెదఅమిరం గ్రామం వద్ద మరో వాహనాన్ని తప్పించబోయి కింద పడిపోయాడు. దీంతో దీంతో తీవ్ర గాయాలపాలైన నాగేశ్వరరావు అక్కడికక్కడే మీతి చెందాడు. నాగేశ్వరరావు భార్య నిర్మల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోటరీ అధ్యక్షులు శ్రీనివాస్‌కు పితృవియోగం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు రోటరీ క్లబ్ అధ్యక్షులు, ఐజెయు సభ్యులు ముత్యాల శ్రీనివాస్ తండ్రి పాపారావు (87) ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు రామారావు విజయవాడ లయన్స్ క్లబ్ అధ్యక్షులుగా పనిచేశారు. కుమారులిద్దరూ రోటరీ, మానవత స్వచ్ఛంద సంస్థల్లో చురుగ్గా ఉన్నారు. పాపారావు భౌతికకాయాన్ని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, పలువురు రోటరీ, మానవత సభ్యులు పరామర్శించారు. ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ సంతాపం తెలిపారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు

జగన్‌ది అరాచక పాలన : ఎంఎల్ఎ నిమ్మల

పాలకొల్లు రూరల్:ముఖ్యమంత్రి జగన్ పాలనలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు విమర్శించారు. తిల్లపూడి గ్రామంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జగన్ పాలన చేపట్టాక ఇదేం కర్మ రా నాయనా అని ప్రజలు అనుకుంటున్నారని తెలిపారు. తేమ శాతం పేరుతో రైతులను ఇబ్బంది పెడుతున్నారని, నిత్యావసర ధరలన్నీ బాగా పెరిగిపోయాయని తెలిపారు. ఏ ఇంటికి వెళ్లినా అనేక సమస్యలు చెబుతున్నారని, జగన్ అరాచక పాలన సాగిస్తున్నారని తెలిపారు. త్వరలోనే జగన్ పాలనకు జనం చమర గీతం పాడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ అంగర రామ్మోహనరావు, కామిశెట్టి అయ్యప్ప నాయుడు, ఇన్‌ఛార్జి పాముల రజని, తిల్లపూడి గ్రామ ఇన్‌ఛార్జి ఇంటి శ్రీరాములు, నీలం తాతాజీ పాల్గొన్నారు.

'ప్రసాదరాజుపై అనుచిత వ్యాఖ్యలు సరికావు'


మొగల్తూరు:నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలూ కృషి చేస్తున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజుపై టిడిపి, జనసేన ప్రజా ప్రతినిధులు అర్థరహిత విమర్శలు చేయడం సరికాదని వైసిపి నాయకులు తెలిపారు. ఆదివారం సాయంత్రం మొగల్తూరులోని ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధికార ప్రతినిధి, మాజీ ఎంపిపి అందే భుజంగరావు, సొసైటీ ఛైర్మన్ మోటుపల్లి రామ భాస్కరరావు, ఎఎంసి వైస్ ఛైర్మన్ కటికల సూర్యారావు, మండల అధ్యక్షుడు కర్రి ఏసుబాబు, ఆకన దొరబాబు మాట్లాడారు. చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజును మాజీ ఎంఎల్ఎ బండారు మాధవ నాయుడు ఏకవచనంతో మాట్లాడడం, జనసేన ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్ ఆరోపణలు చేయడం దారుణమన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఎంఎల్ఎకు ఆర్‌టిసి కార్మికుల వినతి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఆర్‌టిసి అధికారుల తీరుతో తాము తీవ్ర ఆందోళన చెందుతున్నామని సంస్థ సిబ్బంది ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు తమను ప్రభుత్వోద్యోగులుగా నియమించారని, కానీ స్థానిక డిపో అధికారులు మాత్రం తమ సమస్యలను పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎనిమిది గంటలకు పైబడి డ్యూటీలు చేసినా ఓటి చెల్లించడం లేదని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న అలవెన్స్‌లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. బస్సు కండిషన్ గాని, రోడ్డు కండిషన్ గాని దృష్టిలో పెట్టుకోకుండా పలు విధాలుగా సిబ్బందిపై చేస్తున్న కక్ష సాధింపును అరికట్టాలన్నారు. అలాగే రన్నింగ్ టైం ఇవ్వాలని, వివిధ రూట్లలో తగ్గించిన బస్సులను యథావిధిగా కొనసాగించాలని, డ్యూటీకి వచ్చిన సిబ్బందికి డ్యూటీలు లేవని చెప్పి అన్యాయంగా లీవ్‌గా మార్పు చేసే విధానాన్ని మార్పు చేయాలని కోరారు. డ్రైవింగ్‌తో పాటుగా టిక్కెట్లు కూడా ఇచ్చే టిమ్ డ్యూటీకి వెళ్లాలని, సిబ్బందిని ఇబ్బంది పెట్టడం తగదని అన్నారు. ముఖ్యంగా మహిళా సిబ్బందికి లేట్ అవర్స్ డ్యూటీలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించాలని కోరారు. అంతేకాకుండా డిపో వద్ద మహిళా విశ్రాంతి రూమ్‌లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. దీనిపై ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆర్‌టిసి సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



ఎంఎల్ఎ గ్రంధికి వినతిపత్రం అందజేస్తున్న ఆర్‌టిసి కార్మికులు

పసందైన.. పచ్చళ్లు..



మన్నా సల్వా పికిల్ హోమ్

వీరభద్రపురంలోని మన్నా సల్వా నాన్‌వెజ్ పికిల్ హోమ్‌కు ప్రత్యేక గుర్తింపు

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాల వారు సంవత్సరానికి సరిపడా ఊరగాయ, పచ్చళ్లు పట్టేవారు. కాని మారుతున్న కాలంతో పాటు ఆహారపు అలవాట్లలో కూడా మార్పులొచ్చాయి. ఇంట్లో భోజనం చేసేటప్పుడు, వివాహాది శుభకార్యాల్లో ఎదురుగా పంచభక్ష పరమాన్నాలు ఉన్నా పచ్చడి లేనిదే ముద్ద దిగని వారు ఎంతో మంది ఉన్నారు. అలాంటి వారి కోసం కొందరు ప్రత్యేకంగా పచ్చళ్లు తయారు చేసి అమ్ముతున్నారు. శాఖాహార పచ్చళ్లతో పాటు మాంసాహార పచ్చళ్లనూ అందుబాటులో ఉంచుతున్నారు. తణుకు పట్టణంలో ఇలాంటి దుకాణాలు సుమారు పది ఉన్నాయి.

ఒకప్పుడు పచ్చళ్లు కేవలం గ్రామీణ ప్రాంతాల్లోనే తయారయ్యేవి. ఊరగాయ అంటే శాఖాహార పచ్చళ్లే ఎక్కువగా పట్టేవారు. ఇప్పుడు పట్టణ ప్రాంతాల్లోనూ శాఖాహార, మాంసాహార ఊరగాయలూ అందరిచేత లొట్టలేయిస్తున్నాయి. ఊరగాయ పచ్చడి పెట్టాలంటే ఒకప్పుడు మహిళలు ఎంతో శ్రమ పడేవారు. ఇప్పుడు ప్యాకెట్లలో ఎక్కువ కాలం నిల్వ ఉండే పచ్చళ్లను విక్రయించే దుకాణాలు వెలిశాయి.



పీతల పచ్చడి



రొయ్యల పచ్చడి

తణుకు నుండి విదేశాలకు..

తణుకు పట్టణంలో తయారయ్యే ఊరగాయ పచ్చళ్లు విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. పట్టణంలో పచ్చళ్లు విక్రయించే దుకాణాలు పది వరకూ ఉన్నాయి. వాటిలో 15వ వార్డు వీరభద్రపురంలోని మన్నా సల్వా నాన్‌వెజ్ పికిల్ హోమ్ ప్రత్యేక గుర్తింపు పొందింది. ఈ దుకాణం నుంచి విదేశాలకు ఎక్కువ శాతం పచ్చళ్లు ఎగుమతవుతున్నాయి. మన ప్రాంతానికి చెందిన వారు అమెరికా, కువైట్, దుబాయ్ నుండి వచ్చిన వారు తిరుగు ప్రయాణంలో పచ్చళ్లను తీసుకెళ్తున్నారు. అక్కడి వారికి రుచి చూపించడంతో, విదేశీయులు మళ్లీమళ్లీ వీటిని కావాలని అడుగుతున్నట్లు కొనుగోలుదారులతో పాటు నిర్వాహకులు చెబుతున్నారు.

స్థానికంగా ఆదరణ

తణుకు పట్టణంతో పాటు జిల్లాలోని పలు పట్టణాలైన ఏలూరు, తాడేపల్లిగూడెం, భీమవరం, నరసాపురం, పాలకొల్లు, నిడదవోలు నుంచి కూడా ఇక్కడి పచ్చళ్లను తీసుకెళ్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి ఉద్యోగ, వ్యాపార, విద్య కోసం ఎక్కువ మంది వస్తుంటారు. ఈ పచ్చళ్లపై ఎక్కువగా మక్కువ చూపిస్తున్నారు.

పచ్చళ్లలో ఎన్నో వెరైటీలు..

ఒకప్పుడు పచ్చడి అంటే ఆవకాయ, మాగాయ, ఉసిరికాయ, పండుమిరపకాయ ఉండేవి. మారుతున్న భోజన ప్రియుల అభిరుచి మేరకు ఎన్నో రకాల పచ్చళ్లు అందుబాటులోకి వచ్చాయి. మాంసాహార ప్రియుల కోసం నాటుకోడి, కోడి, మటన్, రొయ్య, చేప, పీత, కొరమేను పచ్చళ్లు, రొయ్య కారప్పొడి వంటివి విక్రయ దుకాణాల్లో దొరుకుతున్నాయి. వీటితో పాటు శాఖాహారుల కోసం వివిధ కాయగూరల పచ్చళ్లతో పాటు కాకరకాయ కారప్పొడి, ఇడ్లీ కారప్పొడి, కందిపొడి, శొంటి పొడి, కరివేపాకుపొడి లభిస్తున్నాయి.

ప్రత్యేక ప్యాకింగ్‌ల్లో..

పచ్చళ్లు ఎక్కువ కాలం నిల్వ ఉండేలా నాణ్యతతో కూడిన సామగ్రి వాడుతున్నట్లు విక్రయ నిర్వాహకులు చెబుతున్నారు. మాంసాహార పచ్చళ్లు రెండు నెలలు, శాఖాహార పచ్చళ్లు సంవత్సరం పాటు నిల్వ ఉంటాయని తెలిపారు. ప్రత్యేక ప్యాకింగ్‌ల్లో ఈ పచ్చళ్లు లభ్యమవుతున్నాయి.

పచ్చళ్లకు ఆదరణ పెరిగింది..


ఎమ్‌డి అబ్దుల్ రహమాన్, హోమ్ యాజమాని



రుచి, శుచి బాగుండడంతో పచ్చళ్లకు ఆదరణ పెరిగింది. పశ్చిమగోదావరి జిల్లాతో పాటు తూర్పుగోదావరి జిల్లా నుంచి కొనుగోలుదారులు వస్తున్నారు. ఇటీవల కాలంలో విదేశాలకు వెళ్లేవారు వీటిని ఎక్కువగా తీసుకెళ్తున్నారు. వీరభద్రాపురంలోని షాపుతో పాటు, ప్రయాణికులకు అందుబాటులో ఉంటే విధంగా తేతలి వై-జంక్షన్ వద్ద, తణుకు ఉండ్రాజవరం రోడ్డు వద్ద బ్రాంచిలను ఏర్పాటు చేశాం.

వ్యాపారుల పొట్టకొట్టడం దారుణం : సిపిఎం

ప్రజాశక్తి - మొగల్తూరు



బాధితులతో మాట్లాడుతున్న కవురు పెద్దిరాజు

చిరు వ్యాపారుల పొట్టకొట్టడం దారుణమని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కవురు పెద్దిరాజు అన్నారు. శనివారం అధికారులు చిరు వ్యాపారుల దుకాణాలను తొలగించిన విషయం విదితమే. అయితే ఆదివారం సాయంత్రం సిపిఎం నాయకులు ఉపాధి కోల్పోయిన వారితో మాట్లాడారు. అనంతరం నేతలు మాట్లాడుతూ సుమారు 30 సంవత్సరాలుగా ఉపాధి పొందుతున్న పేదల పొట్ట కొట్టడం సమంజసం కాదన్నారు. వైసిపి ప్రభుత్వం, అధికారులు కలిసి కక్షపూరితంగా ముందస్తుగా ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా గంట సమయంలో వందల మంది పోలీసు బందోబస్తు పెట్టి యంత్రాలతో దుకాణాలు కుల్చడం దారుణం అన్నారు. బీచ్‌లో ఉన్న హంసా రెస్టారెంట్ కూల్చకపోవడం ఏంటని ప్రశ్నించారు. హంసా రిసార్ట్‌లో అసాంఘిక కార్యక్రమాలు, మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నా ప్రభుత్వానికి కనిపించలేదా అని ప్రశ్నించారు. సముద్ర అలలకు చేర్చి ఉన్న దాన్ని ఎందుకు ఖాళీ చేయించలేదని ప్రశ్నించారు. ఉపాధి కోల్పోయిన బాధితులకు తక్షణం ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు. జనసేన నియోజకవర్గ నాయకులు చాగంటి మురళీకృష్ణ (చిన్న) మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా బీచ్‌లో చిన్న దుకాణాలు ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందుతున్న వారి షాపులను కూల్చడంతో ఏ విధంగా బతుకుతారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలను ఆదుకోవాల్సిన ప్రభుత్వం వారి ఉపాధిని కొల్లగొట్టడం దారుణమని విమర్శించారు. ఉపాధి కోల్పోయిన బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

వాలీబాల్ నారాయణరాజు స్ఫూర్తి.. ఆదర్శం

ఉప ముఖ్యమంత్రి కొట్టు, రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి కారుమూరి



మంత్రి కారుమూరిని సత్కరిస్తున్న క్రీడీ నిర్వాహకులు

ప్రజాశక్తి - పాలకోడేరు

కీర్తిశేషులు వాలీబాల్ నారాయణరాజు పేరున ఇంత పెద్ద ఎత్తున రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం అభినందనీయమని, నారాయణరాజు ఒక వ్యక్తి కాదని శక్తి అని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. పాలకోడేరులో నాలుగు రోజుల నుంచి నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం రాత్రితో ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మంత్రులతోపాటు ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు, జెడ్‌పి ఛైర్మన్ కౌరు శ్రీనివాస్, ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు, ఎంఎల్ఎ మంతెన రామరాజు, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు, ఎంపిపి భూపతి రాజు సత్యనారాయణ రాజు (చంటిరాజు) విచ్చేశారు. ఈ సందర్భంగా నారాయణరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం నారాయణరాజు మెమోరియల్ నిర్వాహకులు పవన్ కుమార్‌రాజు ఆధ్వర్యంలో వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ నారాయణరాజు గుర్తుగా ఆయన కుమారుడు పవన్‌కుమార్ రాజు రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. నారాయణరాజు క్రీడాభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. అందరి సమిష్టి కృషితో క్రీడలు ఘనంగా నిర్వహించి క్రీడాకారులకు చేయూతనివ్వడం అభినందించదగ్గ విషయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఇంజేటి మరియమ్మ లక్ష్మీపతి, ఎంపిటిసిలు నాగలక్ష్మి, స్వాతి, ఉప సర్పంచి దెందుకూరి వెంకటరాజు, గ్రామ పెద్దలు గాదిరాజు రాంబాబు, కొత్తపల్లి కాశీ విశ్వనాథరాజు పాల్గొన్నారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు

మహిళా విభాగంలో గుంటూరు, పురుషుల వి భాగంలో ప్రకాశం జిల్లా జట్టు గెలుపు

పాలకోడేరులో నాలుగు రోజుల నుంచి నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ ఛాంపియన్షిప్ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. 13 జిల్లాల నుంచి 13 మహిళా, 13 పురుష జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. క్వార్టర్, సెమీ ఫైనల్‌లో సత్తా చాటి ఫైనల్‌లో జట్లు పోటీపడ్డాయి. మహిళా విభాగంలో గుంటూరు జిల్లా జట్టు మొదటి స్థానంలో గెలుపొందిగా, కృష్ణా జిల్లా జట్టు రెండో స్థానం, పశ్చిమగోదావరి జిల్లా మూడో స్థానంలో నిలిచింది. పురుషుల విభాగంలో ప్రకాశం జిల్లా మొదటి స్థానం సాధించగా, పశ్చిమగోదావరి జిల్లా రెండో స్థానం, విశాఖపట్నం జట్టు మూడో స్థానంలో నిలిచాయి. గెలుపొందిన క్రీడాకారులకు గదిరాజు నారాయణ రాజు మెమోరియల్ ఆధ్వర్యంలో గాదిరాజు పవన్ కుమార్‌రాజు సహకారంతో ఎంఎల్ఎ మంతెన రామరాజు బహుమతులు ప్రదానం చేశారు.



గెలుపొందిన పురుషుల విభాగం మొదటి జట్టు



స్థలాన్ని పరిశీలిస్తున్న జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్

త్వరలో బిసి కమ్యూనిటీ హాలు నిర్మిస్తాం : జెడ్‌పి ఛైర్మన్

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ఉల్లంపర్రు గ్రామంలో త్వరలో బిసి కమ్యూనిటీ హాల్ నిర్మిస్తామని జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం జెడ్‌పి ఛైర్మన్ ఉల్లంపర్రులో పర్యటించి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. త్వరలోనే కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామన్నారు. అలాగే యానాదుల పేటలో పుంత రోడ్డు నిర్మించాలని స్థానికులు కోరగా జెడ్‌పి ఛైర్మన్ ఛైర్మన్ సానుకూలంగా స్పందించి రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట మద్దాల వాసు, రావాడ సతీష్, చందక సత్తిబాబు, గూడూరి త్రిమూర్తులు, బొంతు వెంకటేశ్వరరావు, ఎం.సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

వైస్‌ఎంపిపికి వైసిపి నేతల పరామర్శ

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు మండల వైస్ ఎంపిపి కైలా సుబ్బారావును వైసిపి నాయకులు ఆదివారం పరామర్శించారు. సుబ్బారావు భార్య గౌరి లక్ష్మి ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో సుబ్బారావు కుటుంబ సభ్యులను వైసిపి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధికారి ప్రతినిధి అందే భుజంగరావు, ఎఎంసి వైస్ ఛైర్మన్ కటికెల సూర్యారావు, సొసైటీ ఛైర్‌పర్సన్ మోటిపల్లి రాంభాస్కర్ రావు, కర్రి ఏసుబాబు, ఆకన దుర్గారావు, ఎన్.శ్రీనివాస్ ఉన్నారు.

పెదపుల్లేరులో జగనన్న లేఅవుట్ల పరిశీలన

ప్రజాశక్తి - ఉండి



సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్‌డిఒ దాసి రాజు

పెదపుల్లేరులోని జగనన్న లేఅవుట్లను ఆదివారం భీమవరం ఆర్‌డిఒ దాసి రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా దాసి రాజు మాట్లాడుతూ జగనన్న కాలనీలోని లేఅవుట్లను, ఇళ్లను పరిశీలించానని తెలిపారు. కాలనీలో నూతనంగా ఇళ్లు నిర్మించుకున్న వారితో మాట్లాడారు. ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించిందో లేదో అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా భీమవరం డివిజన్‌లోని గృహ లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టాలన్నారు. ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం సహాయం అందిస్తోందన్నారు.

రైతులను ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - తణుకు రూరల్

మాండూస్ తుపాన్ నేపథ్యంలో రైతులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పివి.ప్రతాప్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తుపాన్ వల్ల రైతులు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఇంకా 40 శాతం మాసూళ్లు కావాల్సి ఉందని తెలిపారు. మరికొన్ని చోట్ల కోతలు కోయాల్సి ఉందని తెలిపారు. ఇప్పటికే మాసూళ్ల అయిన ధాన్యం అమ్మకాలు పూర్తి చేయాలని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం రైతులను ఆదుకునేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతుల నుండి మొత్తం ధాన్యాన్ని తేమ శాతంతో సంబంధం లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. గోనె సంచుల కొరత లేకుండా అధికారులు చూడాలని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రతి రైతుకూ అందేలా చూడాలని పేర్కొన్నారు. అమ్మిన ధాన్యానికి వెంటనే నగదు జమ చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.

13, 14, 15 తేదీల్లో శిక్షణ తరగతులు

ప్రజాశక్తి - అత్తిలి

ఈ నెల 13, 14, 15 తేదీల్లో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, మండల పరిషత్ అభివృద్ధి ప్రణాళిక సుస్థిర అభివృద్ధి లక్ష్యం కోసం మూడు రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ వివివిఎస్.రామారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమాలు ఎంపిడిఒ కార్యాలయంలో జరగనున్నట్లు తెలిపారు. 13న మొదటి బ్యాచ్‌లో ఎంపిపి, జెడ్‌పిటిసి, జెడ్‌పి కోఆప్షన్, ఎంపిటిసి, కో ఆప్షన్ సభ్యులతో పాటు మండల స్థాయి అధికారులు, అగ్రికల్చరల్, హార్టికల్చర్ అసిస్టెంట్, పశు వైద్య సిబ్బంది, ఎఎన్ఎం (హెల్త్ డిపార్ట్మెంట్) హాజరుకానున్నారని తెలిపారు. రెండో బ్యాచ్ 14వ తేదీన పంచాయతీ కార్యదర్శులు (గ్రేట్ 1 నుండి 5), గ్రామ సర్పంచులతో పాటు, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు హాజరు కావాలని తెలిపారు. 15వ తేదీన మూడో బ్యాచ్‌లో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, విఆర్‌ఒలు, స్కూల్ హెచ్‌ఎంలు, డిజిటల్ అసిస్టెంట్లు, ఎన్ఆర్ఇజిఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.



రేషన్ పంపిణీ వాహనం ఢీకొట్టడంతో విరిగిన విద్యుత్ స్తంభం

కరెంటు స్తంభాన్ని ఢీకొన్న రేషన్ పంపిణీ వాహనం

ప్రజాశక్తి - నరసాపురం

కరెంటు స్తంభాన్ని రేషన్ పంపిణీ వాహనం ఢీకొన్న సంఘటన పిఎంలంకలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. డ్రైవర్ వేగంగా నడిపి కరెంటు స్తంభాన్ని ఢీకొట్టాడని, దీంతో స్తంభం రెండు ముక్కలుగా విరిగిపోయిందని తెలిపారు. అయితే ఈ ప్రమాదంలో ఎవరికీ ప్రాణాపాయం జరగలేదు.

సాగరతీరం.. కోలాహలం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెంబీచ్ వద్ద ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక ద్విచక్ర వాహనాల్లో చేరుకున్నారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆహ్లాదంగా గడిపారు.

సైన్స్ పట్ల అవగాహనుండాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సైన్స్ పట్ల విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్‌వి.రమణ అన్నారు. ఆదివారం స్థానిక విశ్వకవి రెసిడెన్షియల్ పబ్లిక్ స్కూల్లో జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు ఘనంగా జరిగాయి. ముందుగా స్కూల్ ప్రిన్సిపల్ తులసి రాణి జాతీయ జెండాను ఎగరవేసి సంబరం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి రమణ మాట్లాడుతూ ప్రపంచాన్ని సైన్స్ నడిపిస్తుందని తెలిపారు. గ్రామాల్లో నేటికీ మూఢాచారాల వల్ల ప్రజలు అనే కష్టాలను ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సంబరాలకు పోటీపడేందుకు జిల్లా వ్యాప్తంగా పలు మండలాలకు చెందిన 40 టీములుగా, 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో ప్రభుత్వ పాఠశాల నుండి మొదటి బహుమతి పెనుగొండ గ్రామానికి చెందిన కెవిఆర్ గర్ల్స్ హైస్కూల్ సాధించగా, రెండో బహుమతి తాడేపల్లిగూడెం టిఎస్‌ఎం హైస్కూల్ సాధించింది. మూడో బహుమతి పాలకొల్లుకు చెందిన బివిఆర్‌ఎం హైస్కూల్ సాధించిందన్నారు. ప్రయివేట్ పాఠశాల నుండి మొదటి స్థానం, ఆదిత్య ఉల్లంపర్రు, విశ్వకవి హైస్కూల్ భీమవరం రెండో స్థానం, ఆదిత్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆకివీడు సాధించిందన్నారు. ఈ కార్యక్రమంలో జెవివి నాయకులు చింతపల్లి ప్రసాదరావు, ఎం.శ్రీనివాసరావు, పి.శ్రీనివాస్‌రాజు, మాధవిలత, లోకేష్, సిహెచ్ గౌరీ లక్ష్మి పాల్గొన్నారు.

గుమ్మంపాడులో గడపగడపకూ మన ప్రభుత్వం

ప్రజాశక్తి - అత్తిలి

గుమ్మంపాడులో ఆదివారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ బుద్ధరతి భరణి ప్రసాద్, వైసిపి మండల అధ్యక్షులు పైబోయిన సత్యనారాయణ పాల్గొన్నారు.